## క్లుప్తంగా

### పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మండలంలోని చినమానపురం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం దర్శించుకున్నారు. గ్రామదేవత పండగ నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, నారాయణమూర్తిరాజు, సర్పంచ్ వెంకట శివపార్వతి, తదితరులు ఉన్నారు.

### సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

జామి: మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు మంగళవారం మకర తోరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వి.సాయికిరణ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### శివుని విగ్రహం ఏర్పాటు పనులు

గజపతినగరం: గజపతినగరం మండల కేంద్రం దిగువ వీధిలో శ్మశానవాటిక సమీపంలో శివుని విగ్రహం ఏర్పాటుకు కుమ్మర వీధికి చెందిన ఎడ్ల గోపి ముందుకొచ్చారు. విగ్రహం ఏర్పాటు పనులను మంగళవారం ప్రారంభించారు. శ్మశానవాటికను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిన గోపిని పలువురు అభినందించారు.

### బీమాతో ఆర్థిక భరోసా



బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

గంట్యాడ: ప్రతి ఒక్కరూ ప్రమాద బీమాను చేయించుకోవాలని స్టేట్ బ్యాంక్ జిల్లా ఫైనాన్షియల్ ఇంక్లూజన్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కొటారుబిల్లి గ్రామంలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా (పీఎంజేజేబీవై)లపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద బీమా చేయడం వల్ల వ్యక్తి మరణించినా, ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న డాక్టర్ స్రవంతి

దత్తిరాజేరు: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీ, బిడ్డలు సురక్షితంగా ఉంటారని కె.కొత్తవలస వైద్యాధికారి స్రవంతి అన్నారు. ప్రధాన్ మంత్రి సురక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా స్థానిక పీహెచ్‌సీలో 20 మంది గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. పండ్లు, ఆకు కూరలు, పాలు ఆహారంతో తీసుకోవాలని సూచించారు.

### 54 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు



వేపాడ: గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: ప్రధాన మంత్రి సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ ధరణి సుమారు 54 మంది గర్భిణులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలతో పాటు పాటించాల్సిన ఆహార నియమాలను వివరించారు. బానాది గ్రామానికి చెందిన సాయి ట్రస్ట్ ప్రతినిధులు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

# సచివాలయాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): మండల స్థాయి అధికారులు నిరంతరం గ్రామ సచివాలయాలను పర్యవేక్షణ చేయటం అలవాటుగా చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల జిల్లాలో జరిగిన సమీక్షలో సచివాలయ ఉద్యోగులపైనే ఎక్కువుగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం సచివాయాలకు వెళ్తున్న ప్రజల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల సచివాలయాల ఉద్యోగులు స్పందించే విధానం, తీరు బాగాలేదని ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కొంతమంది సచివాలయ ఉద్యోగులు ట్రైనింగ్ పేరుతో సచివాయాలకు వెళ్లకుండా విధులకు డుమ్మా కొట్టారని, ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారితో మాట్లాడితే వాస్తవాలు తెలిశాయని, ఈ క్రమంలో సచివాలయాలను నిత్యం పర్యవేక్షణ జరిపేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. మండల స్థాయి అధికారులు నిత్యం సచివాలయాలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించారని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా సీఎం దృష్టికి తీసుకువెళ్లవచ్చన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులు లేని మండలంగా గరివిడిని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. తాటిగూడ గ్రామంలో ఓవర్‌లోడ్‌తో విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతుందని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని కోరగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు జరిగేలా చూడాలని ఏడీ జగన్నాథంకు సూచించారు. అంతకుముందు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాములనాయుడు, జి.వెంకటఅప్పలరాజు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**బాలబడితో చిన్నారుల భవిష్యత్‌కు బాటలు: జెడ్పీ చైర్మన్**

మెరకముడిదాం: బాలబడితో చిన్నారుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సోమలింగాపురం పంచాయతీ పరిధి గొల్లలమర్రివలస బాలబడిలో ఇటీవల జిల్లాపరిషత్ నిధులు సుమారు రూ.2 లక్షలతో నిర్మించిన ప్రహరీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలబడిలో చదువుతున్న చిన్నారి ఆవాల రాజేష్ వివిధ దేశాలు, వాటి రాజధానులు, రాష్ట్రాలు-రాజధానుల పేర్లను 3 నిమిషాల్లో చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు. రాజేష్‌ను జెడ్పీ చైర్మన్ అభినందించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌ను శోధన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.డి.కామేశ్వరరావు సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

బొండపల్లి: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) అన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేసే పత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా, అవినీతికి తావులేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామని, ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంకా గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభాజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, మాజీ ఎంపీపీ బండారు బంగారం, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, పార్టీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, బోద్దల చిన్నంనాయుడు, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి, స్థానిక సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, ఎంపీటీసీ కోమ్మా నాగమణి, తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**నేడు కెరటాంలో..**

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామంలో బుధవారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

# సర్కారు బడుల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలతో పాటు మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓ భానుప్రకాష్‌ను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నారని, అందులో భాగంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించడం గొప్పవిషయమన్నారు. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో మండలంలో ఇప్పటికే ఉన్న 8 ఉన్నత పాఠశాలలకు అదనంగా పీకే పాలవలస, దేవరపొదిలాం, రామాంజనేయకాలనీల్లో మరో మూడు ఉన్నత పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, బాణాన శ్రీను, మీసాల రమణ, బాణాన రమణ, గిరడ రాందాసు, కోరుకొండ దాలయ్య, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

### దళిత యువకుడి మృతికి కారకులను శిక్షించాలి

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు స్వామినాయుడు మృతికి కారకులను శిక్షించాలని బహుజన నేత ఆతవ ఉదయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో మంగళవారం స్థానిక పత్రిక విలేకర్లతో మాట్లాడుతూ.. మార్చి 20న పావాడ నుంచి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తున్న సమయంలో జామి నుంచి ఎస్‌కోట వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో స్వామినాయుడు మృతిచెందాడని, ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. దళిత యువకుడి మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎద్దు సూరిదేముడు, అలమండ కోటరావు, కె.రామస్వామి, రామలక్ష్మణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ నిధులతో కంకర రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి బీటీ రోడ్డు కోనేరు వరకు పంచాయతీ నిధులతో కంకర రోడ్డు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి, శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సుమారు 200 మీటర్ల రోడ్డుకు కంకర వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ సాధారణ నిధులు సుమారు రూ.2.5 లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

### నిధుల రికవరీకి సిఫార్సు

గంట్యాడ: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారులకు వేసే మస్టర్లలో దిద్దుబాటులు ఉన్నట్టు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించారు. ఈమేరకు సామాజిక తనిఖీల నివేదికను మంగళవారం అధికారులకు సమర్పించారు. మస్టర్ల దిద్దుబాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. వసంత ఫీల్డ్ అసిస్టెంట్ రూ.5 వేలు, నరవ ఫీల్డ్ అసిస్టెంట్ రూ.5వేలు, పెదమజ్జిపాలెం రూ.400, జగ్గాపురం రూ.200, గంట్యాడ రూ.274, బోనంగి రూ.100 చొప్పున రికవరీ చేయాలని సిఫార్సులో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఏపీఓ ఆదిలక్ష్మి వద్ద ప్రస్తావించగా రికవరీపై ప్రాజెక్టు డైరెక్టర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.

### 104 సిబ్బంది వినతి



డా.హారికకు వినతిపత్రం ఇస్తున్న 104 వాహన సిబ్బంది

శృంగవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 వాహన సిబ్బంది కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారికకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది కోటరావు, మహాలక్ష్మి మాట్లాడుతూ.. మూడు నెలలుగా తమకు వేతనాలు విడుదల కాలేదని, తమను ఏపీసీఓఎస్‌లో చేరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతి పత్రం ఇస్తున్నట్టు చెప్పారు.

### 121 మందికి వైద్య సేవలు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట-2 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణారెడ్డి సుమారు 121 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త ఎ.సత్యవతి, డీఈఓ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆశాలు ఉమ, రాజేశ్వరి పాల్గొన్నారు.

# 90 శాతం రాయితీపై బిందుసేద్యం పరికరాలు



బిందుసేద్యం పరికరాలును పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీనారాయణ

బొండపల్లి: సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని అంబటివలస ఆర్బీకే పరిధిలోని అయ్యన్న అగ్రహారం, అంబటివలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన బిందుసేద్యం పరికరాల పనితీరును క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 30 ఎకరాల్లో రూ.7.29 లక్షలు విలువైన పరికరాలను 90 శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 85 ఎకరాల్లో సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం ఉద్యానవనశాఖ అధికారి ఎ.రాజశేఖర్, ఏపీఎంఐపీ అధికారి సునీల్, ఆర్బీకే సహాయకులు జి.సునీల్‌కుమార్, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధి శ్రీచక్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

శృంగవరపుకోట: వడదెబ్బతో మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబానికి కాంపోజిషన్ గ్రాంట్ నుంచి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ శేషుబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన రేపాక నారాయణమ్మ(55) ఈ నెల 8న ఉపాధిహామీ పనులకు వెళ్లి తిరిగి వచ్చి, కళ్లంలో పశువులకు నీరు పెడుతుండగా స్పృహకోల్పోయి అక్కడే ప్రాణాలు కోల్పోయింది. వడదెబ్బకు గురికావడంతోనే ఆమె మృతి చెందిందని, ఆమె కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని కోరారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా మృతి చెందిన కార్మికులకు ఇస్తున్న పరిహారంతో పాటు పిల్లల పెళ్లిళ్లు, కాన్పులకు ఇచ్చే అలవెన్స్‌లు, స్కాలర్‌షిప్‌లు, మెడికల్ అలవెన్స్‌లు తక్షణమే అమలు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు ఒక్కపూట నిర్వహించేలా ఆదేశాలు విడుదల చేయాలని కోరారు.

# జేవీకే కిట్లు పంపిణీపై హెచ్‌ఎంలకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండలానికి చేరాయని, త్వరలోనే వాటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు, నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులంతా సిద్ధంగా ఉండాలన్నారు.

# డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం..

- ఏఎస్పీ అస్మాపర్వీన్



మాట్లాడుతున్న ఏఎస్పీ అస్మాపర్వీన్

శృంగవరపుకోట: మత్తులో మన సమాజం గాడి తప్పుతోంది. నేరాలకు, ఘోరాలకు ప్రధాన కారణం మత్తు. ఆ మత్తును వదిలిస్తే మన సమాజం బాగుపడుతుందని ఏఎస్పీ అస్మాపర్వీన్ అన్నారు. స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఐ ఎస్.ధర్మారావుతో కలిసి ఎస్.కోట, జామి మండలాల మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాలు బాగుపడాలంటే మీ సహకారం కావాలి. గ్రామాల్లో సారా, గంజాయి వ్యాపారాలు ఉన్నా, జూదం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని, మీకు ఇబ్బంది అనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు విషయం చెప్పాలన్నారు. డ్రగ్స్ వల్ల ఎదురవుతున్న దుష్పరిణామాలను వివరిస్తూ, మీకు ఉద్యోగాలిచ్చింది మంచి సమాజం నిర్మాణం కోసం అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కర్తవ్య నిర్వహణలో తొలుత ఇబ్బందులు ఎదురైనా.. క్రమంగా ఆశించిన మద్దతు దక్కుతుందన్నారు. యువతకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను, కూలిపోతున్న కుటుంబ వ్యవస్థను వివరించాలన్నారు.

### ఖరీఫ్‌కు సన్నద్ధం



వ్యవసాయశాఖ సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న జేడీ రామారావు

శృంగవరపుకోట: ఖరీఫ్‌లో రైతాంగం అవసరాలు తీర్చేలా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు రామారావు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎస్.కోట ఆర్‌బీకేలో కొత్తవలస సబ్‌డివిజన్ స్థాయిలోని వ్యవసాయ అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో డివిజన్ పరిధిలో సాగు చేయనున్న పంటల వివరాలు, విస్తీర్ణం, విత్తన లభ్యత, డిమాండ్, ఎరువులు, పురుగు మందుల లభ్యతను తెలుసుకుని, రైతాంగానికి కావాల్సిన ఇండెంట్లను సిద్ధం చేయాలన్నారు. సీఓసీ కార్డుల ప్రాధాన్యతను వివరించి వాటి రెన్యూవల్స్‌ను వేగవంతం చేయాలని కోరారు. పీఎం కిసాన్ పథకంలో ఈకేవైసీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉద్దేశాన్ని, లక్ష్యాలను వివరించి అందుకు సమాయత్తం కావాలని కోరారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేసినా, విధులకు డుమ్మా కొట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హాజరైన కొత్తవలస ఏడీఏ ఎల్.విజయ ఐదు మండలాల వ్యవసాయాధికారులు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

# 'జగనన్నకు చెబుదాం'తో సమస్యలకు చెక్



దత్తిరాజేరు: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, అధికారులు



జామి ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎంపీపీ,జెడ్పీటీసీ,ఎంపీడీఓ

దత్తిరాజేరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రజలు 1902 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లొచ్చని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెదమానాపురం సచివాలయంలో సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రచారంలో వీక్షించారు. గ్రామాలలో అధికారులు, నాయకులకు సమస్యలు చెప్పుకోలేని వారు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సీఎంఓ కార్యాలయం నుంచి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్, వివిధ శాఖల అధికారులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు.

జామి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమం అమలు, లక్ష్యాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# అటు నుంచి అటే..

- ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాని బస్సులు
- కొత్తవలస జంక్షన్ నుంచే వెళ్లిపోతున్న సర్వీసులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



కొత్తవలస జంక్షన్‌లో విజయనగరం వెళ్లే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

కొత్తవలస: దినదినాభివృద్ధి చెందుతున్న కొత్తవలస పట్టణానికి నిత్యం వేలాది మంది చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడ ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఈ కాంప్లెక్స్‌కు కొన్ని బస్సులు మాత్రమే వస్తుంటాయి. మరికొన్ని బస్సులు కొత్తవలస జంక్షన్ నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో బస్సుల కోసం కాంప్లెక్స్‌లో వేచిఉన్న ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

విజయనగరం నుంచి అనకాపల్లి వెళ్లే బస్సులు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాకుండా కొత్తవలస జంక్షన్ నుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో ఎస్.కోట, ఎల్.కోట, దేవరాపల్లి, కె.కోడపాడు మండలాల నుంచి విజయగనరం వెళ్లాల్సిన ప్రయాణికులు తమ లగేజీలతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. గతంలో ఈ బస్సులు కాంప్లెక్స్‌కు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేవి. అలాగే విశాఖపట్నం నుంచి జామి మీదగా పద్మనాభం వెళ్లే సర్వీసులు కాంప్లెక్స్‌కు రావడం లేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే అరకు నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగిస్తున్న కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు రాత్రి వేళ్లలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాకుండానే నేరుగా వెళ్లిపోతున్నాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సులు రాకపోవడంతో ప్రమాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తవలస మీదగా వెళ్లే ప్రతీ ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌కు వచ్చి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.